## క్లుప్తంగా

### నేడు గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలలోని ఖాళీ సీట్ల భర్తీ కోసం ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదో తరగతి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

**30న ములకలపల్లి గురుకులంలో..**

**ములకలపల్లి:** ములకలపల్లి గురుకుల బాలికల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈనెల 30వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతోపాటు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

### దరఖాస్తులు స్వీకరణ

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్ వద్ద పీపీటీసీ కౌన్సిలర్ ఉద్యోగానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగం కాంట్రాక్టు పద్ధతిలోనే భర్తీ చేస్తామని, ఇందుకోసం డిగ్రీ లేదా పీజీ లో సోషియాలజీ/ సైకాలజీ /సోషల్ వర్క /అంత్రోపాలజీ/ హ్యూమన్ డెవలప్మెంట్ పూర్తి చేసి నర్సింగ్‌లో మూడు ఏళ్ల పాటు అనుభవం ఉండాలని ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు అన్ని పనిదినాల్లో ఆస్పత్రి ఆవరణలోని ఏఆర్టీ సెంటర్ వద్ద తమ దరఖాస్తులను సమర్పించాలని, లేదంటే 9963130775 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

### ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి

**మణుగూరుటౌన్:** కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతంలో ఆర్ఓ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి బుధవారం ఏరియా ఎస్ఓటూ జీఎం శ్యాం సుందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ.. ఏరియాలో తాగునీటి కోసం యాజమాన్యం గోదావరి నీరు అందిస్తున్నప్పటికీ కాలనీ వాసులు తాగునీటి కోసం ప్రైవేట్ మినరల్ ప్లాంట్ ద్వారా వచ్చే తాగునీటిని వినియోగిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లాభార్జనే ధ్యేయంగా అనేక ప్లాంట్‌లు మణుగూరులో నడుస్తున్నాయన్నారు. వీటి వల్ల కార్మిక కుటుంబాలు అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యాన యాజమాన్యమే ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, వినయ్ కుమార్, రేవన్, పద్దం శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్ ఉన్నారు.

### పోస్టర్లు ఆవిష్కరణ

**అశ్వారావుపేట:** అశ్వారావుపేట బస్టాండ్ సెంటర్‌లోని లక్ష్మీ గణపతి ఆలయం 36వ వార్షికోత్సవ ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం భక్తులు ఆవిష్కరించారు. ఈనెల 7 నుంచి 16 వరకు జరుగనున్న నవరాత్రి ఉత్సవాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చల్లపల్లి ప్రసాద్ శర్మ, కమిటీ అధ్యక్షులు బాలేపల్లి నాగరాజు, విజయసాయి సెల్‌వరల్డ్ అధినేత శీమకుర్తి జితేంద్ర, కోటా బాలు, బుక్కూరి బుచ్చిబాబు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

**అశ్వాపురం:** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలగాని జగన్నాథం అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. జగన్నాథం మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, తూము రాఘవులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు జగన్నాథం మృతదేహానికి నివాళులు అర్పించారు.

### పీఓను కలిసిన నాయకులు

**మణుగూరురూరల్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సీనియర్ పీఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఓంకారిబాపును ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్మికుల సమస్యలను వివరించారు. ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ మాజీ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్, నాయకులు బోగా రాజలింగు, రాంశెట్టి కృష్ణచేతన్, కోడి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మంచమెక్కిన పల్లె..!

- ఏజెన్సీలో విజృంభిస్తున్న విష జ్వరాలు
- ప్రభుత్వాస్పత్రిలో మందుల్లేవు..
- ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు..



గుండాల ప్రభుత్వాస్పత్రిలో బెడ్లపై జ్వర బాధితులు

**గుండాల:** ఓ పక్క ముమ్మరంగా కొనసాగుతున్న వ్యవసాయ పనులు.. మరోపక్క ఒళ్లు నొప్పులతో తీవ్ర జ్వరాలు.. ప్రభుత్వాస్పత్రికి వస్తే మందుల కొరత.. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా సతమతం.. ఇదీ విషజ్వరాలతో అల్లాడుతున్న గిరిజన పల్లెల గోస. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పదుల సంఖ్యలో బాధితులు**

గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వంద గ్రామాలుండగా రెండే రెండు ప్రభుత్వాసుపత్రులున్నాయి. ఆరు ఏఎన్ఎమ్ కేంద్రాలున్నాయి. కాగా ప్రస్తుతం గ్రామానికి పదుల సంఖ్యలో జ్వరాలు బారీన పడి అవస్త పడుతున్నారు. జ్వరంతో పాటు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ధో పక్క వ్యవసాయ పనులు ముమ్మరంగా నడుస్తున్నప్పటీ ఈ జ్వరాలతో పనులు చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల పాటు మంచానికే పరిమితమవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు కూడా ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్నాయి.

**ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత..**

జ్వర పడీతులు ప్రభుత్వాస్పత్రికి వస్తున్నా వాటికి సంబంధించి ఇంజక్షన్లు, మందులు లేవని పంపిస్తున్నారు. దీంతో గిరిజనులు ఆర్ఎంపీలను ఆశ్రయించక తప్పడం లేదు. ఇక్కడ జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు రోజుల తరబడి వైద్యం అందిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో పెట్టాల్సివస్తుందని వాపోతున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు మృత్యువాతకు గురైయ్యే ప్రమాదం ఉంది. వ్యవసాయానికే పెట్టుబడుల కోసం అప్పులు చేసే తాము జ్వరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు.

**పారిశుద్ధ్య లోపమే కారణమా..?**

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో పారిశుద్ధ్య పనులు సైతం అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారం, వర్షాలతో అంతర్గత రోడ్ల అధ్వానంగా ఉంటున్నాయి. మురికి నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో గిరిజనులు రోగాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదు. ఆయా మండలాల్లో మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పల్లెలకు వైద్యం అందించాల్సి ఉంది.

#### మందులు లేవంటున్నారు..



గుండాల ఆస్పత్రికి వస్తే రెండు రోజులుగా మందులు లేవంటున్నారు. ప్రైవేటుకు వెళ్లాలంటే పైసలు కావాలి. మూడు రోజులుగా జ్వరం వస్తోంది. ఆర్ఎంపీల వద్దకు వెళ్లక తప్పడం లేదు. వ్యవసాయ పనులు కావడంలో మండల కేంద్రానికి తిరగలేక పోతున్నాం.

– వినోద్, జ్వర బాధితుడు

#### వారం రోజులుగా ఒళ్లు నొప్పులు



గత వారం రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నా. ఆస్పపత్రిలో మందులు లేవంటున్నారు. ఏ పని చేయలేక పోతున్నా. 20 కిలోమీటర్ల నుంచి రావాలంటే చేతకావడంలేదు. ప్రైవేట వైద్యం తీసుకుంటున్నా. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలి.

– కొర్సా పొట్టియ్య, శంభూనిగూడెం

# ఇసుక అక్రమాలు ఆగట్లే..!



కొత్తూరు శివారులోని సీతారామ కాలువ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

**ములకలపల్లి:** ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారు. ఒక్కరాత్రిలో పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక గుట్టుచప్పుడుకాకుండా బయటికి తరలిస్తున్నారు. మండలవ్యాప్తంగా విస్తారంగా వాగుల ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుకాసులు మాఫియాకు తెరలేపారు. రెవెన్యూ, పోలీస్‌శాఖల సహకారంతో ఇదంతా సాగుతోందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

**ఒకచోట తప్పితే మరోచోట..**

మండలపరిధిలోని సంజీవ్‌పల్లి శివారులోని ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు సీజ్ చేయడం, సత్యంపేట సమీపంలోని సీతారామ కాలువ వద్ద అక్రమ రాసులు ఉన్నట్లు బయటికి పొక్కడంతో కొత్తమార్గాలను అన్వేషించారు. కొత్తూరు గ్రామం సరిహద్దులోని సీతారామ కాలువ సమీపంలో మరో ఇసుక డంప్ చేశారు. వీకే.రామవరంలో గ్రామ శివారులో రెండు వేర్వేరు ప్రదేశాల్లో నూతనంగా ఇసుకను డంపింగ్ పాయింట్లను తయారు చేశారు. సీతారాంపురం జీపీ పరిధిలోని గుర్రాలకుంట గ్రామశివారులోనూ డంప్ చేశారు. ఈ ప్రాంతాల నుంచి లారీల్లో అక్రమ రవాణాకు తెగబడ్డారు. సాయంత్రం వేళ సమీప వాగుల నుంచి ట్రాక్టర్లలో ఇసుక నిర్దేశిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళ దర్జాగా లారీల్లో బయటి ప్రాంతాలకు చేరుస్తున్నారు. ఇంతజరుగుతున్నా రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు స్పందించకపోడవడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమంగా బయటికి తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

# ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా..



అశ్వారావుపేట: స్కూలు పిల్లలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అశ్వారావుపేట:** మీ ఎమ్మెల్యే మీ ఇంటికి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతినీ స్వీకరించి ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం మండలంలోని జమ్మిగూడెం, కేశప్పగూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ 6, కల్యాణలక్ష్మి 17 చెక్కులను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో కాలినడకన వెళ్లారు. జమ్మిగూడెంలో రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని, డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరారు. ట్రాన్స్‌కో అధికారులకు వెంటనే ఫోన్ చేసి స్థంబాలు తొలగించాలని సూచించారు. కేశప్పగూడెంలో డబుల్ బెడ్రూం ఇళ్లలోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయని, అల్లాడ మకాంకు వెళ్లే దారిలో కల్వర్టు నిర్మించాలని కోరగా సానుకూలంగా స్పందించి పరిష్కారం అయ్యేలా సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. ఊట్లపల్లిలో రామాలయానికి ప్రహరీ గోడ కావాలని కోరారు. కార్యక్రమంలో ఆయన గిర్దావర్ తాటి కృష్ణ, వెంట కాంగ్రెస్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, నండ్రు రమేష్, చిన్నంశెట్టి సత్యనారాయణ, కొర్రి వెంకటేశ్వరరావు, సుంకవల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన**

**చంద్రుగొండ:** మండలం కేంద్రం చంద్రుగొండలో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.12కోట్ల పనులకు బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. డ్రెయినేజీలు లేక మురుగునీరు, వర్షపు నీటి నిల్వలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు ప్రత్యక్షంగా చూశానన్నారు. రోడ్డుకు ఇరువైపులా 28 అడుగుల వెడల్పులో డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. కట్టడాలు నష్టపోయేవారికి ప్రభుత్వం తరుపున పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్యూరిటీ మినరల్ వాటర్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వచ్చే ఏడాది చంద్రుగొండలో జూనియర్ కళాశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ సుధాకర్, ఏఈ లఖన్ నాయక్, ఎంపీడీఓ అశోక్, కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతన్నలకు అండగా ఉండాలనే ఆకాంక్షతో అమలు చేస్తున్న రూ.2లక్షల రుణమాఫీలో నెలకొన్న సమస్యలు తొలిగించి అర్హులకు అమలు చేసేవిధంగా అప్‌డేట్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో నియోజకవర్గ వ్యవసాయాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఉన్న పేర్లలో ఉన్న తప్పిదాలు, ఆధార్ కార్డు వివరాలు నమోదులో సమస్యలతో పాటు మృతుల వివరాలు తొలిగింపు తదితర వివరాలు వేగంగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రుణమాఫీపై రైతులకు ఉన్న అపోహలు నివృత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

**చేయూతనివ్వాలి..**

పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళల ఆర్థిక చేయూతకు సెర్ప్(ఐకేపీ) ఏడీయూలు చేయూతనివ్వాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో నియోజకవర్గ ఐకేపీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడారు. శ్రీనిధిరుణాల పెరుగుదలకు మైక్రో ఎంటర్‌ప్రైజస్ ద్వారా చిన్నవ్యాపారాల ఏర్పాటు మధ్య తరగతి వ్యాపారాలు ఏర్పాటు, మహిళా శక్తి పథకం ద్వారా అమలు చేయబోయే ఉపాధి ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు 100 శాతం రికవరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రంగారావు, ఏడు మండలాల ఏపీఎంలు, ఏపీఓలు పాల్గొన్నారు.

### కుటుంబ నిర్ధారణ సర్వే

**అన్నపురెడ్డిపల్లి:** రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకోవాలని ఏఓ అనూష అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతు వేదికలో రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాని రైతుల వివరాలను సెల్‌ఫోన్ యాప్‌లో ఆమె నమోదు చేశారు. మండల వ్యాప్తంగా అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట రైతువేదిక వద్ద, వివిధ పంచాయతీ కార్యాలయాల్లో సభ నిర్వహించి వివరాలను నమోదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రైతులు కుటుంబ సభ్యులుతో పాటు ఆధార్‌కార్డులను తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

### వ్యాధి నిరోధక టీకాలు

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామమైన బుడుగులలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెకండ్ ఏఎన్ఎం కౌసల్య కాలినడకన అడవి మార్గంలో ప్రయాణించి గ్రామంలోని ప్రజలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

### అంగన్‌వాడీ టీచర్ మృతి

**దుమ్ముగూడెం:** మండలంలోని మారాయిగూడెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ అపక చిలకమ్మ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని సీఐటీయూ నాయకులు సందర్శించారు. మృతదేహంపై సీఐటీయూ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ, సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, మాజీ సర్పంచ్ తోడం తిరుపతిరావు, దుమ్ముగూడెం ప్రాజెక్టు నాయకురాలు పాల్గొన్నారు.

**రిటైర్డ్ ఉపాధ్యాయుడు..**

**భద్రాచలం:** భద్రాచలం పట్టణంలోని రంగ నాయకులగుట్ట ప్రైమరీ స్కూల్‌లో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన రాధకృష్ణ మాస్టర్ బుధవారం మృతి చెందారు. రాధకృష్ణ మాస్టర్ పాఠశాలలో విద్య బుద్ధులు నేర్పడంతో పాటు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చాలా సంవత్సరాలు శ్రీరామచంద్రునికి సుప్రభాతం, దర్బార్ సేవలో విశేష సేవలు అందించారు. ఆయన మృతికి దేవస్థానం ఈఓ రమాదేవి, ఆలయ సిబ్బంది తీవ్ర సంతాపం తెలియచేశారు.

### 'పోడు'కు పట్టాలివ్వాలి

**ములకలపల్లి:** అర్హులైన సాగుదారుల పోడు భూములకు పట్టాలివ్వాలని తెలంగాణా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం దమ్మపేట మండల పర్యటనకు వచ్చిన ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నోఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు రాకపోవడంతో అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. నానారావు, దినేష్, మంగరాజు, నాగేష్ తదితరులు ఉన్నారు.

### టాయిలెట్లు నిర్మించాలి

**కరకగూడెం:** రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్న కరకగూడెం మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కరకగూడెం మండల సీపీఐ కార్యదర్శి కొమరం కాంతారావు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను దృష్టిలో పెట్టుకొని అయినా పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని కోరారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

**భద్రాచలంటౌన్:** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులు భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ బాధితులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొంది వాటికి సంబంధించిన బిల్లులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అరికెల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

**చర్ల:** పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరం కావచ్చునని కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని దోశిళ్లపల్లి సబ్ సెంటర్ పరిధిలోని సాయినగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్య పరీక్షల అనంతరం ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వేడి ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. శిబిరంలో గ్రామంలోని 65 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో ముగ్గురికి స్వరం ఉన్నట్లు గుర్తించి వారి నుంచి రక్త నమూనాలు తీసుకున్నారు. హెచ్ఎస్ రాంప్రసాద్, హెచ్ఏ నర్సింహారావు, ఏఎన్ఎం స్వరూపరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### కోనో కార్పస్ మొక్కల తొలగింపు

**మణుగూరురూరల్:** శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతున్న కోనో కార్పస్ మొక్కలను పట్టణ ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో నుంచి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన ఈ కోనో కార్పస్ మొక్కలు ఏపుగా ఎదిగి అందంగా దర్శనమిస్తున్నాయి. తక్కువ సమయంలో గుబురుగా పెరిగే ఈ మొక్కల పుప్పొడి ఆరోగ్యానికి హానికరమన్న ప్రచారం సాగుతుండడంతో ఈ మేరకు కోనో కార్పస్ మొక్కల తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కోనో కార్పస్ మొక్కలను ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగిస్తున్నామని, వీటి స్థానంలో ఆరోగ్యకరమైన మొక్కలను నాటుతామని తెలిపారు.

### ఎస్టీ కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

**చర్ల:** రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాల మేరకు గొత్తికోయలైన తమకు ఎస్టీ కులధ్రువపత్రాలివ్వాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు గొత్తికోయ యువకులు వినతిపత్రం అందజేశారు. ఎర్రంపాడు, కిష్టారంపాడు, బూరుగుపాడు తదితర గ్రామాలకు చెందిన తాముకు గత మూడు సంవత్సరాలుగా రాజ్యాంగ పరంగా ఇస్తున్న ఎస్టీ కులధ్రువపత్రాలు ఇవ్వకుండా అర్థాంతరంగా నిలిపివేశారని, దీంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. ఈ విషయమై తాము హోర్టులో ఫిర్యాదు చేయగా ఎస్టీ కుల ధ్రువపత్రాలను ఇవ్వాలని సూచించిందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. వినతిపత్రం వెంట హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీలను జతచేశారు. ఈ కార్యక్రమంలో గొత్తికోయ యువకులు మడకం చందు, కె.భద్రయ్య, ఎం.రాజు, డి.రఘు, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారపట్టిన గ్రామ పంచాయతీ అధికారి



పారపట్టి ఒండ్రు మట్టిని తొలగిస్తున్న గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు

**భద్రాచలంఅర్బన్:** ఇటీవల భద్రాచలం లో వచ్చిన వరదల కారణంగా గోదావరి ఒడ్డున ఉన్న మెట్ల వద్ద ఒండ్రు మట్టి పేరుకుపోయింది. ఈ క్రమంలో గడిచిన నెల రోజుల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు ఈ ఒండ్రు మట్టిని తొలగించేందుకు శ్రమిస్తున్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుల చేస్తున్న పనులను పరిశీలించేందుకు అక్కడికి వచ్చిన ఈవో శ్రీనివాసరావు పారను పట్టి ఒండ్ర మట్టిని ఇలా తొలగించాలని కార్మికులకు సూచించారు. అనంతరం ఈఓ సూచించిన విధంగా సిబ్బంది మట్టిని తొలగింపు పనులను చేపట్టారు.

# బిషప్ ఆనంద్‌పాల్‌పై కేసు కొట్టివేత

**భద్రాచలం:** భద్రాచలంలో క్రిష్టియన్ రైట్స్ కమిటీ, చర్చి నిర్వహకులు బిషప్ ఆనంద్‌పాల్‌పై నమోదయిన క్రిమినల్ కేసును విచారణలో భాగంగా రాష్ట్ర హైకోర్టు కొట్టివేసినట్లు ఆయన, హైకోర్టు న్యాయవాది ముమ్మినేని శ్రీనివాసరావులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను ఆనంద్‌పాల్ మోసం చేసి లోబరుచుకున్నాడని, ఓ బిడ్డ జన్మించాక పెళ్లికి నిరాకరించాడని భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో 2013లో ఛీటింగ్ కేసు నమోదైంది. ఆమెకు సబంధించిన స్థలాన్ని తీసుకుని చర్చి కట్టారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై అసత్య ఆరోపణలతో కేసు పెట్టారని వ్యతిరేకిస్తూ పాల్.. డీఎన్ఏ టెస్టుకు సైతం అంగీకరించారు. డీఎన్ఏ టెస్టు ఫలితాలు ఆనంద్‌పాల్‌కు అనుకూలంగా రావడంతో వాదోపవాదాల అనంతరం తప్పుడు కేసని హైకోర్టు తీర్పునిచ్చినట్లు పాల్, ఆయన న్యాయవాది పేర్కొన్నారు. కాగా భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పరిధిలో పాల్ తరుపున విద్యా సాగర్, సీహెచ్ఎస్ అంబేద్కర్‌లు, హైకోర్టులో ముమ్మినేని శ్రీనివాసరావులు వాదించారు.

# చెక్‌పోస్టు వద్ద అక్రమాలు



భద్రాచలం బ్రిడ్జి పాయింట్ వద్ద ఉన్న జాయింట్ చెక్‌పోస్టు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం బ్రిడ్జి వద్ద ఉన్న జాయింట్ శాఖల చెక్ పోస్ట్ వద్ద అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చెక్‌పోస్ట్ మీదుగా నిత్యం అక్రమంగా పశువుల తరలింపు, ఇంటి సామగ్రితో పాటు ఇతర వస్తువులను కొంత మంది అనుమతులతో, మరికొంత మంది అనుమతులు లేకుండా తరలిస్తుంటారు. ఈ క్రమంలో చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సంబంధిత సిబ్బంది నిత్యం వసూళ్ల పర్వాన్ని సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'నేను డ్యూటీలో ఉన్న సమయంలో వస్తేనే మీకు ఉపయోగం, వేరే వ్యక్తులు ఉన్నప్పుడు వస్తే నాకు సంబంధం లేదు' అంటూ ఓ ఉద్యోగి పశువులు రవాణా చేస్తున్న వ్యక్తులతో అంటున్న మాటలు తెలియవచ్చాయి. ఈ రీతిగానే భద్రాచలం మీదగా అధిక మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ సీసీ కెమెరాల పర్యవేక్షణ కూడా కరువైంది. ఇక్కడ జరుగుతున్న సంఘటనలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

# కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పాకాల దుర్గాప్రసాద్ దంపతులు

**భద్రాచలంఅర్బన్:** సేవ్ భద్రాద్రి ఆధ్వర్యంలో బుధవారం మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గాను భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద అభయాంజనేయ స్వామి ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో గోదావరి వరద బాధితులు, రక్షణ చర్యలకు వచ్చే ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ఆశ్రయం కోసం ఈ కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు, అందుకోసం పట్టణ ప్రముఖులు, ప్రజానీకం నుంచి రూ.36లక్షల విరాళాలను సేకరించినట్లు తెలిపారు. ప్రజలకు ఉపయోగకరంగా దీనిని నిర్మించడంపై సేవ్‌భద్రాద్రి నిర్ణయాన్ని ఎమ్మెల్యే అభినందించారు. నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ (వీరాస్వామి), సేవ్ భద్రాద్రి వ్యవస్థాపకుడు పాకాల దుర్గాప్రసాద్, ఐటీసీ జీఎం చంగళ్‌రావు, కార్యదర్శి చారుగుళ్ల శ్రీనివాస్, సభ్యులు పరిమి సోమశేఖర్, గాదె మాధవరెడ్డి, చావా లక్ష్మీనారాయణ, ఎస్‌కె.అజీమ్, డాక్టర్ సుదర్శన్‌రావు, దేవస్థానం ఈఓ సుదర్శన్, ఆలయ అర్చకులు రవికిరణ్ ఆచార్య, టీఎన్జీఓ మాజీ జిల్లా అధ్యక్షుడు చల్లగుల్ల నాగేశ్వరరావు, భద్రాచలం కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్ ప్రెసిడెంట్ కేశవ, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, సేవ్ భద్రాద్రి సభ్యులు పాల్గొన్నారు.